www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -141 శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Disitrcts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# కొండా సురేఖ ఔట్

## లోక్‌భవన్‌కు సీఎం రేవంత్ రెడ్డి : కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం

## ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరు : సీఎం రేవంత్





బర్తరఫ్ ఉత్తర్వులపై గవర్నర్ సంతకం

కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీ

రాజీనామాకు నిరాకరించిన సురేఖ

బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్

గవర్నర్ కు సిఎం రేవంత్ రెడ్డి లేఖ

సిఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..

### చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు

**హైదరాబాద్ సెప్టెంబర్ 3:(ప్రజావినికిడి):** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు**మిగతా 2లో...**

# నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు



నన్ను తొలగించడం కుట్రే..

రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు

కాంగ్రెస్‌పార్టీలోనే ఉంటా.. నేను పార్టీ మారను

నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని

రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు

బీసీ మహిళా మంత్రిగా అణచివేతకు గురయ్యా

నిర్ణయంపై రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి

బర్తరఫ్ పై మీడియా సమావేశంలో కొండా సురేఖ

అధిష్టానానికి పంపిన లేఖ కొండా సురేఖ రిలీజ్

**హైదరాబాద్,(ప్రజావినికిడి):** మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడకముందే.. తన బర్తరఫ్‌ను ఆమె ధ్రువీకరించారు. ఈ సందర్భంగా టీవీ9తో మాట్లాడిన సురేఖ పలు కీలక విషయాలను వెల్లడించారు.**మిగతా 2లో...**

# రూ.5కోట్ల అక్రమాస్తులు..

## టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం అరెస్ట్

లోకనాథం, ఆయన బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాలు

బంగారం, వెండి, విలువైన స్థలాలు గుర్తింపు

సోదాలు ముగిసిన వెంటనే అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు



**తిరుపతి సెప్టెంబర్ 3(ప్రజావినికిడి):** రుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) డిప్యూటీ ఈవో లోకనాథంను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో ఆయనను అదుపులోకి తీసుకున్న అధికారులు, అనంతరం తదుపరి విచారణ నిమిత్తం ఏసీబీ కార్యాలయానికి తరలించారు.**మిగతా 2లో...**

# ఉద్యమాల ఖిల్లా నుంచే.. గులాబీ గర్జన

**మిర్యాలగూడ సెప్టెంబర్ 3(ప్రజావినికిడి):** సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు నీటి విడుదల షెడ్యూల్‌ను ఈ నెల 14లోపు ప్రకటించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్దేశిత గడువులోగా షెడ్యూల్ ప్రకటించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు వేలాది మంది రైతులతో పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడలో బిఆర్ఎస్ నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కెటిఆర్ విమర్శించారు. ఎన్ని తడులు నీరు విడుదల చేస్తారు.. ఎప్పుడెప్పుడు విడుదల చేస్తారు.వారబందీ విధానం అమలు చేస్తారా అనే అంశాలపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ రైతుల సాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. 2003లో సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల కోసం కెసిఆర్ పాదయాత్ర చేసిన విషయాన్ని



గుర్తుచేస్తూ.. ఇప్పుడు రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తాను కూడా పాదయాత్ర చేస్తానన్నారు. కాంగ్రెస్‌కు ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చిన ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులను ప్రభుత్వం మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# వివేకా హత్య కేసులో ఈడీ దూకుడు

: రూ. 40 కోట్ల డీల్‌పై అప్రూవర్ దస్తగిరి విచారణ

వివేకాను హత్య చేసేందుకు రూ. 5 కోట్ల ఒప్పందం చేసుకున్నట్టు దస్తగిరి వాంగ్మూలం




**అమరావతి సెప్టెంబర్ 3:(ప్రజావినికిడి):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీవ్రతరం చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి మధ్య జరిగిన భారీ ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని విచారిస్తున్నారు. వివేకా హత్య వెనుక ఆర్థిక మూలాలను,**మిగతా 2లో...**

# కేబినేట్ లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..



సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్

ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద

కుడా ఛైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్

బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:(ప్రజావినికిడి):** రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. **మిగతా 2లో...**

# జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ

భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ

బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ

శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు



2లో.

# మోదీని అడిగే దమ్ముందా?..

తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్

మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన

కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్

తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపణ

మెట్రో, నవోదయ, కేంద్రీయ పాఠశాలల అంశాలు ప్రస్తావన

ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 3: (ప్రజావినికిడి):** తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే



హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు**మిగతా 2లో...**

# నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు

మొదటిపేజీ తరువాయి

తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ కూడా తీసుకోలేదని, రాజీనామా చేయాలని కూడా ఎవరూ చెప్పలేదన్నారు. అధిష్ఠానం నుంచి తనకు ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకుని ఉండాల్సిందని అన్నారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కుట్ర చేశారని సురేఖ ఆరోపించారు. అయితే తదుపరి కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాను తప్పు చేశాననే భావన లేదన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన మాటలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. సుస్మిత స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఆమె అభిప్రాయాలను తాము ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము మాట్లాడించలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని చాలామంది విమర్శిస్తున్నా.. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో సీఎం ఆత్మపరిశీలన చేసుకోవాలని సురేఖ అన్నారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారిలో తామే ముందున్నామని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించింది రేవంత్‌రెడ్డినేనని చెప్పారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని సురేఖ స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు అభిమానం ఉందన్నారు. 2018లో కూడా ఇదే "దుష్టశక్తులు" తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నాయని, అందుకే అప్పట్లో బీఆర్ఎస్ వైపు చూడాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని విషయాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్లు వెల్లడించారు. ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపొమ్మంటారా' అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు. తన మీద, తన మాజీ ఓఎస్‌డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీపై నేను ఎలాంటి విమర్శలు చేయలేదు. ఒకప్పుడు మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిట్టారు. మాజీ సీఎం రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని తిట్టారు. నా కుమార్తె వ్యాఖ్యలకు నాపై చర్యలు తీసుకోవటం బాధాకరం. రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్నారని తిట్టినవారికి పదువులు ఇచ్చారు. నన్ను తొలగించినందుకు ఏమీ బాధపడటం లేదు. కారణం చెప్పకుండా తొలగించడమే చాలా బాధాకరం. బీసీ మహిళను ఇలా అవమానకరంగా తొలగించటం బాధాకరం. కారణం చెప్పకుండా తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. కారణం చెప్పాల్సిన బాధ్యత సీఎం, ఏఐసీసీపై ఉందని అన్నారు. మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్‌డీ సుమంత్‌ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని తెలిపారు. మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని సురేఖ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతోషంగా లేరనే విషయం అందరికీ తెలుసనని తెలిపారు. ఇప్పటికైనా అందరూ బయటికి వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలకు సేవ, అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలో ఉందని, పనుల జరగాలంటే ఎవరివద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు. ఇస్తామన్న హామీలు నెరవేర్చకపోవటం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు. తాను తప్పు చేయలేదని, తనకు పశ్చాత్తాపం లేదని కొండా సురేఖ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించానని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని తానే ముందు కోరుకున్నానని పేర్కొన్నారు. తనపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నానన్న కొండా సురేఖ తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరమని తెలిపారు. తన కోసం చిన్నారెడ్డిపై వేటు వేయటం సరికాదని అభిప్రాయపడ్డారు. తన కుమార్తె వ్యాఖ్యలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్న సురేఖ తన కుమార్తె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుపట్టే అధికారం తనకు లేదని స్పష్టం చేశారు. అధిష్ఠానానికి తాను ఇచ్చిన లేఖను మీడియాకు ఇస్తున్నానని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదని తెలిపారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఆమె నిలదీశారు.

అధిష్ఠానం చర్యలకు ముందు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు వివరణాత్మక లేఖ రాశారు. తాజాగా ఆమె ఆ లేఖను బహిర్గతం చేశారు. 2026 ఆగస్టు 23న రాసిన ఈ లేఖలో తాను బీసీ మహిళా మంత్రిగా రాజకీయ అణచివేతకు గురవుతున్నట్లు వివరించారు. వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యేగా, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రిగా పనిచేస్తున్న ఆమె తనకు 31 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉందని, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉందని ప్రస్తావించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తన అధికారాలు క్రమంగా కుదించబడుతున్నాయని ఆమె ఆరోపించారు. తన శాఖలకు సంబంధించిన కీలక నిర్ణయాలు సీఎంఓ నుంచి నేరుగా జారీ అవుతున్నాయన్నారు. తనను సంప్రదించకుండా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. యాదాద్రి టెంపుల్ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు వంటి ముఖ్యమైన అంశాల్లో తనకు సమాచారం కూడా ఇవ్వలేదని, సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి నిధులు ఒక్క రోజులోనే రోడ్లు, భవనాల శాఖకు బదిలీ చేశారని వివరించారు. శ్రీ రామనవమి సందర్భంగా ప్రభుత్వ ప్రకటనల్లో తన ఫోటోను తొలగించడం తన గౌరవాన్ని దెబ్బతీసిందని అన్నారు.

# మోదీని అడిగే దమ్ముందా?..

మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు.

బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు.

గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు.

తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

# ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరు

## : సీఎం రేవంత్



హైదరాబాద్: సెప్టెంబర్ 3: (ప్రజావినికిడి): చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హైదరాబాద్ అభివృద్ధి, మెట్రో విస్తరణ, మౌలిక వసతులు, పేదల సంక్షేమంపై సీఎం పలు కీలక ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వం కేవలం కొబ్బరికాయ కొట్టి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసిందని తెలిపారు.

**'ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ'**

పాతబస్తీపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను గతంలోనే చెప్పినట్లు ఇది ఓల్డ్ సిటీ కాదని.. 'ఒరిజినల్ సిటీ' అని అన్నారు. ఇక్కడి ప్రతి గల్లీ తనకు తెలుసని పేర్కొన్నారు. అసదుద్దీన్ ఓవైసీ కోరిన అభివృద్ధి పనులను మంజూరు చేయాలని అధికారులను ఈ వేదికగా ఆదేశిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అబ్దుల్లా బలాలా.. కళాశాల అభివృద్ధికి రూ.20 కోట్లు కోరగా.. రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రభుత్వం నిధులు ఇస్తుందని, అయితే ఏడాదిన్నరలోపు అభివృద్ధి పనులు పూర్తి చేసే బాధ్యత ఎమ్మెల్యేదేనని స్పష్టం చేశారు. విద్య కోసం ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

ఆపరేషన్ సింధూర్ సమయంలో అసదుద్దీన్ ఓవైసీ దేశానికి మద్దతుగా నిలిచి దేశభక్తిని చాటుకున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయ సిద్ధాంతాలు వేర్వేరుగా ఉండొచ్చుని.. దేశభక్తి విషయంలో మాత్రం అందరం ఒక్కటేనని పేర్కొన్నారు. కేబుల్ బ్రిడ్జిని చూడాలంటే ప్రస్తుతం దుర్గం చెరువుకు వెళ్లాల్సి వస్తోందని సీఎం అన్నారు. అందుకే మీరాలం చెరువులో సుమారు 3 కిలోమీటర్ల మేర కేబుల్ బ్రిడ్జిని నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే వచ్చే ఎన్నికల్లోగా గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలు సేవలను పూర్తి చేస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల సమయంలో మెట్రోలో ప్రయాణిస్తూ ప్రజలను ఓట్లు అడుగుతామని వ్యాఖ్యానించారు.

**హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు**

హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. హిందువులు, ముస్లింలు కలిసి ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారని సీఎం ఆరోపించారు. మూసీని అభివృద్ధి చేసి నగరంలో నైట్ ఎకానమీని ప్రోత్సహిస్తామని తెలిపారు. పేద ముస్లింలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్, వనస్థలిపురం, రాజేంద్రనగర్, శంషాబాద్ వరకు మెట్రోను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

హైదరాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం భావిస్తోందని సీఎం అన్నారు. అయితే బీజేపీ, బీఆర్ఎస్ అడుగడుగునా అడ్డుపడుతున్నాయని విమర్శించారు. ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయని.. ఎన్నికలు పూర్తయ్యాక అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి అన్నారు. అందరూ కలిసి హైదరాబాద్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

**ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరు: సీఎం**

ఈ క్రమంలో సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తనను ఎవరూ ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవులు, బెదిరింపులకు తాను లొంగే ప్రసక్తే లేదని సీఎం స్పష్టం చేశారు. తనను ప్రేమతో మాత్రమే గెలవగలరని, ఒత్తిళ్లకు తాను తలవంచనని సీఎం పేర్కొన్నారు.

# రూ.5కోట్ల అక్రమాస్తులు..

మొదటిపేజీ తరువాయి

నిన్న ఉదయం నుంచే తిరుపతి ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి లోకనాథం నివాసంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ విస్తృత సోదాలు నిర్వహించారు. సుదీర్ఘంగా సాగిన ఈ తనిఖీల్లో దాదాపు రూ. 5 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను ఏసీబీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. తనిఖీల సమయంలో ఆయన నివాసంలో 2 కిలోల బంగారం, 6.5 కిలోల వెండి, రూ. 12.50 లక్షల ద్రవ్య నగదును స్వాధీనం చేసుకున్నారు.

వీటితో పాటు ఆయన భార్య, కుమారుడి పేర్లతో పలుచోట్ల ఇళ్లు, విలువైన స్థలాలు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. నిన్న ప్రారంభమైన సోదాలు ముగిసిన వెంటనే, ఈరోజు ఆయనను అరెస్ట్ చేశారు. టీటీడీ కీలక అధికారిని ఏసీబీ అరెస్ట్ చేయడం ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో తీవ్ర కలకలం రేపింది.

# వివేకా హత్య కేసులో ఈడీ దూకుడు

మొదటిపేజీ తరువాయి

మనీ లాండరింగ్ కోణాన్ని వెలికితీసేందుకు ఈడీ ఈ దర్యాప్తును వేగవంతం చేసింది.

హత్య వెనుక ఎర్ర గంగిరెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలతో పాటు మరికొందరి మధ్య రూ. 40 కోట్ల డీల్ జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై ఈడీ అధికారులు దస్తగిరిని ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా వివేకా హత్యకు ముందు, ఆ తర్వాత అనుమానాస్పదంగా జరిగిన బ్యాంకు లావాదేవీల చిట్టాను బయటకు తీస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు దస్తగిరి తన బ్యాంకు ఖాతాల స్టేట్‌మెంట్లతో విచారణకు హాజరయ్యారు.గతంలో సీబీఐ విచారణ సందర్భంగా... వివేకాను హత్య చేసేందుకు తనకు రూ. 5 కోట్లు ఇస్తామని ఒప్పందం చేసుకున్నట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చారు. నాటి సీబీఐ స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని, ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరెవరి ఖాతాల్లోకి బదిలీ అయిందనే విషయాలపై ఈడీ ఆరా తీస్తోంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద చేపడుతున్న ఈ విచారణతో వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సూత్రధారుల చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తోంది.

# కొండా ఔట్

మొదటిపేజీ తరువాయి

ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది. సురేఖ న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

# కేబినేట్ లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

మొదటిపేజీ తరువాయి

అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

# జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. "ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి" అని పేర్కొన్నారు.నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు.జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు.ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది.

భారత్-ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శుక్రవారం 4 సెప్టెంబర్ 2026

# మహిళపై కుక్కల దాడి...

## మున్సిపల్ అధికారుల తీరుపై కాలనీవాసుల ఆగ్రహం





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆనంద్ అలాగే ఈశ్వర్ కాలనీలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి.ప్రతిరోజూ కాలనీవాసులపై దాడులకు పాల్పడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి.బుధవారం రాత్రి కాలనీ పార్కు వైపు కాలినడకన వెళ్తున్న ఓ మహిళపై వీధి కుక్కలు ఒక్కసారిగా విరుచుకుపడి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో అప్రమత్తమైన కొందరు కాలనీవాసులు ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.
కాలనీలో వీధి కుక్కల దాడులకు రోజుకొకరు గురవుతున్నప్పటికీ సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వీధుల్లో నడిచేందుకు, పిల్లలను బయటకు పంపేందుకు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొన్నారు. మోటార్ సైకిల్ పై వెళ్తున్న వ్యక్తులని వీధి కుక్కలు వెంబడిస్తున్నాయని ప్రయాణికులు భయాందోళనకు గురి అవుతున్నారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఆనంద్ ఈశ్వర్ కాలనీలో వీధి కుక్కల బెడదను నివారించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమస్యను పరిష్కరించాలనిప్రజలకు ప్రమాదకరంగా మారిన వీధి కుక్కలను నిబంధనల ప్రకారం పట్టుకుని నియంత్రణ చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణకు నూతన దిశ..

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో షాద్‌నగర్ అభివృద్ధికి కొత్త ఊపిరి..**

**1000 రోజుల కాంగ్రెస్ పాలన ప్రజల నమ్మకానికి నిదర్శనం.. మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి నాయకత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకమే కాంగ్రెస్ ప్రభుత్వానికి అతిపెద్ద బలం. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండగా, షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేస్తున్న కృషి అభివృద్ధికి మరింత వేగం తీసుకొస్తోంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రతి కుటుంబానికి సంక్షేమం,ప్రతి ప్రాంతానికి అభివృద్ధి అందించడమే మా లక్ష్యం.

**ప్రజల ఆశీస్సులతో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్తాం.**

తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా షాద్‌నగర్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీనాయకులు,కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ర్యాలీలో యూత్ కాంగ్రెస్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గౌతమ్ మోడల్ స్కూల్ అత్తాపూర్ బ్రాంచ్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**హైదరాబాద్,(ప్రజావినికిడి):**గౌతమ్ మోడల్ స్కూల్ అత్తాపూర్ బ్రాంచ్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని ప్రత్యేక కార్యక్రమాలతో అలరించారు.చిన్నారులు శ్రీకృష్ణుడి, గోపికల వేషాల్లో ముస్తాబై పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. చిన్నారుల అందమైన వేషధారణలు, వారి ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రాంగణం చిన్నారుల సందడితో పండుగ వాతావరణాన్ని సంతరించుకుందిఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి. కృష్ణారావు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు అలాగే పండుగల ప్రాధాన్యతను తెలియజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్‌చార్జ్‌లు లక్ష్మి, సునీత,రజిత, రజిని,శిరీషతో పాటు స్టాఫ్ సౌమ్య,స్వప్న పాల్గొన్నారు. పాఠశాల సిబ్బంది సహకారంతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఉత్సాహంగా, ఆనందంగా జరిగాయి.



# రోడ్డే పార్కింగ్.. పోలీసులదే నిర్లక్ష్యం..

- ఎల్బీనగర్ లో రోడ్ల ఆక్రమణ.. ట్రాఫిక్ పోలీసుల మౌనం..
- పార్కింగ్ లేదు.. ట్రేడ్ లైసెన్స్ ఎలా వచ్చింది.?
- 24 గంటలు రోడ్డుపైనే పార్కింగ్.. అధికారులు ఏం చేస్తున్నారు.?
- ఫుట్‌పాత్ కబ్జా.. రోడ్డుపై పార్కింగ్.. ప్రజలకు నరకయాతన
- చిట్టిబాబు బిర్యానీ ముందు మెయిన్ రోడ్డే పార్కింగ్ స్థలం..
- మామూలు ఇస్తున్నాం.. మమ్మల్ని ఎవరేం చేస్తారు.?
- ఎల్బీనగర్ చౌరస్తా అస్తవ్యస్తం.. ట్రాఫిక్ పోలీసుల డ్యూటీ ఎక్కడ.?
- రోడ్లు వ్యాపారుల సొంతమా.? పార్కింగ్ మాఫియాకు పోలీసుల అండనా.?
- ట్రాఫిక్ జామ్‌లకు అడ్డుకట్ట ఏది.? సీఐ,ఏసీపీ పర్యవేక్షణ ఏది.?
- వాహనాల ఫోటోలకే పరిమితం, అక్రమ పార్కింగ్ పై పట్టింపు ఎక్కడ.?







**ఎల్బీనగర్, (ప్రజావినికిడి):**
ఎల్బీనగర్ చౌరస్తా అంటే నిత్యం రద్దీ.. వాహనాల రాకపోకలతో కిటకిటలాడే ప్రాంతం. అలాంటి కీలక ప్రాంతంలో రహదారులే పార్కింగ్ ప్రదేశాలుగా మారుతున్నా ట్రాఫిక్ పోలీసులు అసలు పట్టించుకోవడం లేదనే తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఉదయం నుంచి రాత్రి వరకు మెయిన్ రోడ్డు పక్కనే హోటళ్ల ముందు వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది.

**పార్కింగ్ లేకుంటే ట్రేడ్ లైసెన్స్ ఎలా.?**

వ్యాపార సంస్థలకు పార్కింగ్ సదుపాయం ఉందా.? లేదా.? అనే అంశాన్ని మున్సిపల్ అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. అయితే పార్కింగ్ సదుపాయం లేకపోయినా వ్యాపారాలకు అనుమతులు, ట్రేడ్ లైసెన్సులు ఎలా జారీ అయ్యాయన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. లంచాలు తీసుకొని ట్రేడ్ లైసెన్లు ఇష్టారాజ్యాంగ ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వ్యాపార సంస్థలకు వచ్చే వాహనాలు రోడ్డుపైనే నిలిస్తే ప్రజలు, పాదచారులు, ఇతర వాహనదారులు ఇబ్బందులు పడటం సహజం.

**24 గంటలు రోడ్డుపైనే పార్కింగ్**

ఎల్బీనగర్ లో ని చిట్టిబాబు బిర్యానీ ముందు రహదారి వాహనాల పార్కింగ్‌తో నిత్యం ఇబ్బందికరంగా మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాలు రహదారిపైనే నిలిచిపోతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని రహదారిని పార్కింగ్ గా మార్చుకున్న వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రద్దీ సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని వాహనదారులు వాపోతున్నారు.

**మామూలు ఇస్తున్నాం, ఎవరు ఏం చేస్తారు.?**

అక్రమ పార్కింగ్‌పై పాదాచారులు ప్రశ్నిస్తే కొందరు వ్యాపార యజమానులు దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులకు మామూలు ఇస్తున్నాం.. ఎవరేం చేసుకుంటారో చేసుకోండి.. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు అంటూ కొందరు బహిరంగంగానే సవాల్ చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ఈ ఆరోపణల్లో వాస్తవమెంత.? అన్నది ఉన్నతాధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది.

**రోడ్లు,ఫుట్‌పాత్‌లు కబ్జా..పాదచారులకు తిప్పలు..**

ఒకవైపు రోడ్లపై పార్కింగ్.. మరోవైపు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో ఎల్బీనగర్ చౌరస్తా ప్రాంతంలో పాదచారుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోంది. నడిచేందుకు ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో ప్రజలు రోడ్డుపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ప్రమాదాల పారిన పడుతున్నారని, మరింత ప్రమాదాల ముప్పు కూడా పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ట్రాఫిక్ సీఐ, ఏసీపీ పర్యవేక్షణ ఏది.?**

ఇంతటి కీలకమైన ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నా ట్రాఫిక్ సీఐ, ఏసీపీ స్థాయి అధికారులు పరిస్థితిని ఎందుకు సమీక్షించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.రహదారిపై అక్రమ పార్కింగ్‌ను నియంత్రించాల్సిన పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**పోలీసులు డ్యూటీ చేస్తున్నారా.? డౌటే**

ఎల్బీనగర్ చౌరస్తా చుట్టుపక్కల రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నా, వాహనాలు ఇష్టారాజ్యంగా నిలుస్తున్నా, ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యంగా మారుతున్నా అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు క్షేత్రస్థాయిలో ఏం చేస్తున్నారన్న ప్రశ్న ప్రజల్లో వ్యక్తమవుతోంది.
రోడ్లు ప్రజల రాకపోకల కోసం..వ్యాపార సంస్థల ప్రైవేట్ పార్కింగ్ కోసం కాదని ఉన్నత అధికారులు గుర్తించాలి. రహదారులను ఆక్రమించి పార్కింగ్ చేస్తున్న వారిపై, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ట్రేడ్ లైసెన్సుల జారీపై కూడా సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యను తీర్చకుండా అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే ఎల్‌బీనగర్ చౌరస్తా ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత చిరునామాగా మారే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అక్రమార్కుల అడ్డాగా కీసర

## కాసులు కురిపిస్తున్న 'అక్రమ షెడ్లు' -అధికారుల మౌనం.. అక్రమార్కుల ప్రతాపం

**నోటీసులతో కాలయాపన.. రాత్రికి రాత్రే లేస్తున్న నిర్మాణాలు..**

**ప్రభుత్వ ఖజానాకు గండి.. ఉన్నతాధికారులు మౌనం.. -డిప్యూటీ కమిషనర్ జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ శూన్యం..**

**పత్రికలో కథనాలు వచ్చిన పట్టించుకోని ఉన్నతాధికారులు, రెచ్చిపోతున్న సిబ్బంది..**





**కీసర, (ప్రజావినికిడి):**
కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు అసలు తగ్గడం లేదు. నిబంధనలను బేఖాతరు చేస్తూ, అధికారుల కనుసన్నల్లోనే ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వాణిజ్య షెడ్లు, గోదాములు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కీసర, అహ్మద్‌గూడ, దమ్మాయిగూడ, యాప్రాల్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అక్రమ నిర్మాణాలపై స్థానికులు, కాలనీవాసులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రం అధికారులు హడావుడిగా నోటీసులు జారీ చేయడం.. పనులు నిలిపివేయించామని రికార్డుల్లో చూపి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది.కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు వెళ్లిన మరుక్షణమే పనులు మరింత వేగవంతం కావడం గమనార్హం. పగలు,రాత్రి తేడా లేకుండా నిర్మాణాలు పూర్తవుతున్నా టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున 'నజరానాలు' చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. మున్సిపాలిటీ స్థాయి నుంచి కార్పొరేషన్ పరిధిలోకి మారినప్పటికీ అధికారుల అలసత్వ ధోరణిలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని అధికార పార్టీకి చెందిన కొందరు నేతల అండదండలు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది కనుసన్నల్లోనే ఈ దందా నడుస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. నిబంధనల ప్రకారం రావాల్సిన రుసుములు, పన్నులు చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోందనే ఆరొపనులున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

టౌన్ ప్లానింగ్ విభాగంలో కాగితాలకే పరిమితమయ్యే నోటీసుల డ్రామాలకు స్వస్తి పలికి,అక్రమంగా వెలుస్తున్న భారీ షెడ్లను తక్షణమే సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న డిప్యూటీ కమిషనర్,సెక్షన్ ఆఫీసర్,ఏసిపి లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు,ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా ఉన్నతాధికారులు,విజిలెన్స్ బృందాలు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# 1000 రోజుల కాంగ్రెస్ పాలనకు ప్రజల హర్షం- ఘనంగా బైక్ ర్యాలీ..



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ప్రజా పాలనకు 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకుగురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. 283వ డివిజన్ డి- మార్ట్ నుంచి ప్రారంభమైన ఈ భారీ బైక్ ర్యాలీలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందనిపేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మేడ్చల్మల్కాజిగిరి వైస్ ప్రెసిడెంట్ బి. శివకుమార్, 283వ డివిజన్ ప్రెసిడెంట్ కనకరావు,మాజీ మున్సిపల్ చైర్మన్ జైరామ్, 281వ డివిజన్ అధ్యక్షుడు జలీల్ ఖాన్,జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిమి రెడ్డి, మేడ్చల్మల్కాజిగిరి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ తైలం శ్రీనివాస్,డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కార్యం ప్రకాష్, మైనారిటీ అధ్యక్షుడు అజర్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మురళీ,భాస్కర్, వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు మాధవి రాణి, చిన్నమ్మ,నీల గుప్త,లక్ష్మీ రెడ్డి, లక్ష్మీ,భాగ్య తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేశారు.



శ్రీ కృష్ణ వేషధారణలో బాలుడు శ్రీమాన్

# తీజ్ నిమజ్జనంలో పాల్గొన్న యువత



**అశోక్ నగర్, (ప్రజావినికిడి):** అశోక్ నగర్ లోని గాంధీ పార్క్ లో తొమ్మిది రోజులపాటు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన తీజ్ ఉత్సవాలు గురువారం నిమజ్జన కార్యక్రమంతో ముగిశాయి. ఉదయం నుంచే గాంధీనగర్ పార్క్ లోని తీజ్ ప్రాంతంలో సేవాలాల్ మహారాజ్ అలాగే మేరమ్మ యాడికి ప్రముఖులు ముక్కులు చెల్లించుకుని ప్రసంగించారు. మధ్యాహ్నం ఉత్సవ కమిటీ ప్రతినిధులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథులు కల్కి భగవాన్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ సింగర్ భిక్షు నాయక్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్గనైజేషన్ మరియు తీజ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు శంకర్ నాయక్, కిరణ్ రాథోడ్ లు మాట్లాడుతూ, అశోక్ నగర్ లో మొట్టమొదటిసారిగా తీజ్ నిర్వహించడం గర్వంగా ఉందని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయినా ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. తొమ్మిది రోజులపాటు ఐకమత్యంగా సోదర భావంతో అందరూ కలిసి ఈ పండుగను నిర్వహించడం & బంజారా సంస్కృతి సాంప్రదాయాలను పాటించడం ఆనందంగా ఉందని వారు తెలియజేసారు. యువతి & యువకులు తీజ్ బుట్టలతో డీజే పాటలపై నృత్యాలు చేసుకుంటూ ట్యాంక్ బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్యాంక్ బండ్ లో తీజ్ బుట్టలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమానికి సజావుగా నిర్వహించడంలో సహకరించిన పోలీస్ మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ నాయక్,కిరణ్ రాథోడ్,ప్రవీణ్ నాయక్,శింబు నాయక్,నరేష్, భాస్కర్, నరసింహ, ఆనంద్,ఉమేష్ ,కుమార్, సోమేష్, బాలకోటి,రాకేష్, పవన్ కల్యాణ్, రవి నాయక్, ప్రకాశ్,జగన్, శ్రీకాంత్,శివ, దివ్య,వైష్ణవి, జ్యోతి,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కళావతి నగర్‌లో మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 291వ డివిజన్ షాపూర్ నగర్ పరిధిలోని కళావతి నగర్‌లో మల్టీపర్పస్ హాల్ (కమ్యూనిటీ హాల్) నిర్మాణానికి రూ. 18 లక్షల నిధులు మంజూరు కాగా, ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని మల్టీపర్పస్ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, కళావతి నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పలకృష్ణ, సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి,డీసీసీ సెక్రటరీ సంతోష్, గాదె వినోద్, కాలనీ సీనియర్ నాయకులు రజితా రత్నం, రజాక్,కృష్ణ, బుచ్చయ్య పతి, అచ్చమ్మ, నరసమ్మ, సంపంగి వెంకటేష్, అరుణ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అవినీతి పాలనపై కదంతొక్కిన కుత్బుల్లాపూర్ గులాబీ సైన్యం..

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కాంగ్రెస్ వెయ్యి రోజుల దగా పాలనపై వారం రోజులపాటు నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కుత్బుల్లాపూర్, దుండిగల్, బాచుపల్లి మండల రెవెన్యూ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించిన బిఆర్ఎస్ శ్రేణులు..
డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ,జీవో 59 ఇళ్ల క్రమబద్ధీకరణ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రెవెన్యూ ఉన్నతాధికారులకు వినతిపత్రం..కాంగ్రెస్ వెయ్యి రోజుల దగా పాలనపై సమర శంఖం పూరించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో ఈనెల 7 రోజుల పాటు నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం రెండవ రోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కుత్బుల్లాపూర్, దుండిగల్, బాచుపల్లి రెవెన్యూ కార్యాలయాల వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ అవినీతిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,రాజకీయాలకతీతంగా, పార్టీలకతీతంగా నిష్పక్షపాతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించిన ఘనత కేసీఆర్ ఆధ్వర్యంలోని బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు దక్కాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను తమ అనుయాయులకు,దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తూ అనర్హులకు కేటాయిస్తుందన్నారు. కాబట్టి రెవెన్యూ ఉన్నతాధికారులు ఈ అవినీతి పాలనపై నిష్పక్ష



విచారణ చేపట్టి దళారులుగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏవైతే పెండింగ్ లో ఉన్న జీవో 59 దరఖాస్తులను వెంటనే పూర్తిచేసి పేద ప్రజల ఇళ్లను క్రమబద్ధీకరించాలి. ఇందిరమ్మ పథకం క్రింద అర్హులకు ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పి దరఖాస్తుదారుడు నుంచి పదివేల రూపాయలు కట్టించుకున్న ప్రభుత్వం, ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం కుత్బుల్లాపూర్ లో ఎక్కడ ప్రభుత్వ భూమి కేటాయించారు, ఏ విధమైన నిర్మాణాలు చేపడుతున్నారు. ఎప్పటి లోగా ఇండ్ల నిర్మాణం చేపట్టి పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తారనే దానిపై దరఖాస్తుదారులకు, నిరుపేదలకు స్పష్టత ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ప్రభుత్వం మరో మారు నిరుపేదలను మోసం చేస్తుండగా కొందరు దళారులు మాత్రం ఇదే అదునుగా భావిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారని,ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టి అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అనంతరం అర్హులకు అందాల్సిన డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు లో జరుగుతున్న అవినీతి,జీవో 59 క్రమబద్ధీకరణవంటి అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి దళారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రెవెన్యూ ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# అశ్విని మృతి కలచివేసింది

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

### కమ్మదనం గురుకుల పాఠశాలను సందర్శించిన అంజయ్య యాదవ్



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**




నియోజకవర్గంలోని కమ్మదనం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో గిరిజన విద్యార్థిని మూడవత్ అశ్విని మృతి చెందడం బాధాకరమని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత వై. అంజయ్య యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ గురువారం రోజు కమ్మదనం ప్రభుత్వ గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థిని మృతి పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని, అశ్విని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. అశ్విని మృతికి దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని అంజయ్య యాదవ్ కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల భద్రత,సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. విద్యార్థులకు అవసరమైన మానసిక ధైర్యం,కౌన్సెలింగ్ అందిస్తూ వారి సమస్యలను తెలుసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అశ్విని కుటుంబ సభ్యులకు మరోసారి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి,మన్నె కవిత నారాయణ, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,సర్పంచ్ లత కిరణ్,మాజీ సర్పంచ్ నరసింహా,నాయకులు రాజు, రాఘవేందర్ రెడ్డి,గుడిసె బాలరాజు,అంజి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో చౌలపల్లిలో మట్టి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన రవీందర్ యాదవ్



**కేశంపేట,(ప్రజావినికిడి):** ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందించడంలో ముందుండే బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ మరోసారి సేవాభావాన్ని చాటుకున్నారు. కేశంపేట మండలం చౌలపల్లి గ్రామంలోని కోట మైసమ్మ దేవాలయం నుంచి హనుమాన్ దేవాలయం వరకు మట్టి రోడ్డు నిర్మాణ పనులను తన సొంత నిధులతో చేపట్టారు. ఈ మేరకు రోడ్డు పనులను గురువారం గ్రామస్థుల సమక్షంలో ప్రారంభించారు. దేవాలయాలకు వెళ్లే భక్తులతో పాటు గ్రామస్థులు రాకపోకల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు రవీందర్ యాదవ్ తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింగరావు,బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ పర్వత్ రెడ్డి,ఎన్ఆర్ఐ నాయకులు గోగు వెంకట నారాయణరెడ్డి, సర్పంచులు హరి శేఖర్,వేణుగోపాల్ చారి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్ష పదవికీ రాజీనామా..



**రంగారెడ్డి,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రంగారెడ్డి జిల్లా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న అనంత నరసింహ మాదిగ రాజీనామా చేసినట్టు గురువారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అనంత నరసింహ మాదిగ మాట్లాడుతూ, మందకృష్ణ మాదిగ యొక్క మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిలో అవకాశం వస్తే చేరుతానని తెలిపారు.

# షాద్ నగర్ లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ,ప్రదర్శన,సభ





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రానికి కాపలా కుక్కలా ఉంటానని చెప్పిన కేసీఆర్ గత వెయ్యి రోజులుగా ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యారని తెలంగాణ "కాపలా కుక్క" ఎక్కడికి వెళ్లిందని? షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ బిఆర్ఎస్ పార్టీ తీరుపై భగ్గుమన్నారు.
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో గురువారం యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ అందెమోహన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ప్రదర్శన,సభను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి స్థానిక చౌరస్తా వరకు ప్లకార్డులతో ఊరేగింపుగా కాంగ్రెస్ ప్రదర్శన నిర్వహించారు. ఫామ్ హౌస్ లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లిక్కర్ తాగుతున్నట్టు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై వాటిని ఊరేగించారు.
షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శన సభకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. గత వెయ్యి రోజులుగా ఫామ్ హౌస్ కే పరిమితమైన
కెసిఆర్ తీరును నిరసిస్తూ షాద్ నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ వందలాదిమంది కార్యకర్తలు భారీ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,

**ప్రగతి భవన్ & ప్రజా భవన్ గా మార్చి నేటికి 1000 రోజులు**

ప్రగతి భవన్ ముందు కంచె తొలగించి "ప్రజా భవన్" గా మార్చి దొర అహంకారం దించి నేటికి1000 రోజులు..కేవలం జీతం కోసమే సంవత్సరానికి ఒకే ఒక్క సారి అసెంబ్లీకి వచ్చేలా చేసే ప్రభుత్వానికి నేటికి 1000 రోజులు..తనను భావి ముఖ్యమంత్రి అని జాకీలు పెట్టి మరీ లేపేలా చేయడానికి చిన్న దొర జీతగాళ్లకు నెలకు 9 కోట్ల రూపాయలు ఇచ్చేది కూడా 1000 రోజులు.. అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బిఆర్ఎస్ పార్టీ తీరుపై ధ్వజమెత్తారు. ప్రభుత్వం రాలేదని ఫామ్ హౌస్ కే పరిమితమైన కేసీఆర్ తెలంగాణకు కాపలా కుక్కలాగా ఉంటానని తన కుటుంబ ఫామ్ హౌస్ కే కాపలా ఉన్నాడు అంటూ ఎమ్మెల్యే శంకర్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ 1000 రోజుల్లో రూ.కోటి 24 లక్షల 40 వేల జీతం తీసుకున్నారనీ,
ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే డిస్మిస్ చేస్తారనీ మరి కేసీఆర్‌ను ఏం చేయాలి. ప్రతిపక్ష నాయకుడి హోదా ఉన్నందుకు ఆయనకు ఇన్ని రోజులు సెక్యూరిటీ,ఇల్లు,బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తదితర వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు ఖర్చు చేసిందన్నారు.
కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలనీ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు.ఆయన రాజీనామా కోరుతూ ప్రజలు ఊరూరా ఉద్యమాలు చేయాలనీ కాంగ్రెస్ కార్యకర్తలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు.

**ప్రజా ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాన్ని ప్రజలు తిప్పి కొట్టాలి.**

ప్రజాపాలన ఏర్పడి 1000 రోజులు పూర్తయ్యాయని దీంతో ప్రతిపక్ష నేతకు ఈర్ష ద్వేషాలు కుట్రలు మొదలయ్యాయని వీర్లపల్లి శంకర్ వివరించారు. ప్రజా ప్రభుత్వంపై బురద జల్లాలనీ కుట్రలు చేస్తున్నారంటూ బిఆర్ఎస్ పార్టీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూసి ఆశ్చర్యపోయామన్నారు వీర్లపల్లి శంకర్.ధనిక రాష్ట్రంగా తెలంగాణను కేసీఆర్‌కు అప్పగిస్తే.. అప్పులకుప్ప చేశారంటూ విమర్శలు గుప్పించారు. పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. కేసీఆర్‌కు ముందు ఉన్న సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు కాగా.. కేసీఆర్ ఒక్కరే రూ.7.50 లక్షల కోట్ల అప్పు చేశారన్నారు.ఈ అప్పుల కోసం నెలకు రూ.7,500 కోట్ల అసలు, వడ్డీ కడుతున్నామని వివరించారు. ఏడాదికి రూ.80-90 వేల కోట్ల అప్పు కడుతున్నామని వీర్లపల్లి శంకర్ తెలిపారు.

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య ఆయన కుమారులకు ఫాం హౌజ్ ఎక్కడిది..?**

కెసిఆర్ బాటలోనే స్థానిక మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆయన కుమారులు విలాసవంతమైన జీవితాలను అనుభవించడం లేదా? ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే గత 10 సంవత్సరాలు అధికారంలో అమాయకులను దోచుకోలేదా అని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శలు గుప్పించారు. ఆందోళన సందర్భంగా స్థానిక నేతలపై ఆయన ధ్వజమెత్తారు. ఎదుటివారిని విమర్శించేముందు గత ప్రభుత్వ హయాంలో తాము కూడా ఏం చేశారు ఒకసారి తెలుసుకోవాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యేకు ఫామ్ హౌస్ లేదా అని ఎమ్మెల్యే శంకర్ ప్రశ్నించారు.అధిష్టానం దృష్టిలో పడేందుకు రాజకీయ విలువలు దిగజార్చుతున్నారని అన్నారు. మరో నాయకుడు సైతం ఆ పార్టీలో ప్రజలను ముంచే రాజకీయంగా ఎదుగుతున్నాడని అలాంటివారు నీతులు చెబుతున్నారని ఆరోపించారు.

**కెసిఆర్ ఇచ్చిన హామీలు మరిచారా.?**

దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని, అదేవిధంగా దళితులకు మూడెకరాల భూపంపిణీ ఏమైందని ప్రశ్నించారు. గిరిజనులకు మైనార్టీలకు షాద్ నగర్ వేదికగా 12 శాతం రిజర్వేషన్ హామీ ఇచ్చి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో రాజ్యాంగాన్ని అవమానించిన కేసీఆర్‌ను తెలంగాణ నుంచి తరిమికొట్టడానికి బడుగు బలహీనవర్గాల ప్రజానీకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మించేందుకు కుర్చీ వేసుకొని కూర్చుంటానని ఇచ్చిన హామీ ఏమైంది అన్నారు. 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కేసిఆర్ ప్రజా పాలనను ప్రతిపక్ష నేతగా గాడిలో పెట్టడానికి అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. బిల్లా రంగాలను రంగలోకి దించి టిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని డబ్బాలుకొట్టుకుతిరుగుతున్నారని అన్నారు.అధికారంలో ఉంటే మా కుటుంబం లేకపోతే ఇంకా ఎవరూ లేరన్న చందంగా వ్యవహరిస్తున్న కేటీఆర్ హరీష్ రావులను ప్రతిపక్షాన్ని కడిగిపారేస్తామని అన్నారు.
ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి,పంది వెంకట్ రాంరెడ్డి,కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ రఘు నాయక్,యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి,కౌన్సిలర్ల,

# లింగారెడ్డిగూడలో స్మార్ట్ కార్డులు పంపిణీ కార్యక్రమం..

**పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..**

**నాకు గాని,బక్కని నరసింహులుకు గాని ఫామ్ హౌస్ లు లేవు.. -ఎమ్మెల్యే శంకర్..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
గతంలో రేషన్ కార్డుల వ్యవస్థను వెలుగులోకి తెచ్చి నిరుపేదల కడుపు నింపిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు స్మార్ట్ కార్డుల పంపిణీ ద్వారా మరో అడుగు ముందుకు వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వతంత్రం వచ్చిన తర్వాత రేషన్ వ్యవస్థను తీసుకువచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అదేవిధంగా తెలుగుదేశం అధినేత ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా అడుగు పెట్టాక (2)రెండు రూపాయలకే కిలో బియ్యంతో ఈ వ్యవస్థను మరింత ముందుకు తీసుకువెళ్లాలని ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన ఆలోచిస్తుందని,దీనిని రాష్ట్ర ప్రజలందరూ గుర్తించాలని పేర్కొన్నారు.అదేవిధంగా గత పాలకుల వలె నాకు గాని,
మా అన్న టిడిపి మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు గాని ఎలాంటి ఫామ్ హౌస్ లు లేవని ఎద్దేవా చేశారు.బక్కని నరసింహులు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏదైనా ప్రజల కోసం పనిచేసినప్పుడు అభినందించడం ప్రజా ప్రతినిధులు అలవాటు చేసుకోవాలని,
అలాగని భజన చేయాల్సిన అవసరం లేదని తప్పులు ఉంటే ప్రశ్నించడం కూడా నేర్చుకోవాలని స్పష్టం చేశారు.చేసే పనిలో పుల్లలు పెట్టడం చాలా తేలిక,కానీ ఆచరించడం అత్యంత కష్టం అని అన్నారు.స్మార్ట్ కార్డులను అర్హులు మాత్రమే ఉపయోగించుకోవాలని, దుర్వినియోగం చేయవద్దని మాజీ ఎమ్మెల్యే సూచించారు.

**ఒకరినొకరు ప్రశంసించుకున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే..**

ఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా నిస్వార్థ నాయకుడిగా రూపాయి కూడా సంపాదించుకోకుండా మాజీ ఎమ్మెల్యే నర్సింలు పనిచేశారని,తన సొంత గ్రామాన్ని గ్రామస్తుల సహకారంతో క్రమశిక్షణతో పెట్టారని ఎమ్మెల్యే శంకర్ అభినందించారు.ఆయన వల్ల గ్రామం అన్ని విధాల ముందడుగు వేసిందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు మాట్లాడుతూ నా సోదర సమానుడు ఎమ్మెల్యే శంకర్ లింగారెడ్డి గూడ గ్రామానికి పాలిటెక్నిక్ కళాశాల తీసుకురావడం, గ్రామాభివృద్ధికి అన్ని విధాల సహకరించడం ఎంతో అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నాగయ్య,పిఎసిఎస్ చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్అలీ ఖాన్,మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్,గ్రామ సర్పంచ్ ఎం సి ప్రవీణ్,ఉప సర్పంచ్ అశోక్,చెంది తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

మున్సిపాలిటీలోని 5వ వార్డులో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం.

హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.,మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్..

ఫరూక్ నగర్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్.



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో లబ్ధిదారుడు వల్యా చంది నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ హాజరై లబ్ధిదారుడితో గృహప్రవేశం చేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. నిరుపేదల సంక్షేమం దృష్ట్యా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకువచ్చిందని,ఈ పథకం ద్వారా అనేక మంది పేదలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా లబ్ధిపొందిన కుటుంబాలకు గౌరవప్రదమైన నివాస సౌకర్యం కల్పించడం జరుగుతోంది అని అన్నారు.ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అనే కలను నిజం చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఎంతో మంది నిరాశ్రయులకు స్థిర నివాసం లభిస్తోంది.ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు.ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని,అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చి తీరుతామని భరోసా ఇచ్చారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అనే కలను నిజం చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా ఎంతో మంది నిరాశ్రయులకు స్థిర నివాసం లభిస్తోంది. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు.పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.ఈ సందర్భంగా లబ్ధిదారురాలు మాట్లాడుతూ నాకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి,స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫోటో ఫోజులు మీవి.. రేషన్ బియ్యం కేంద్రానివి

**సొమ్ము మోదీ ప్రభుత్వానిది.. సోకు రేవంత్ రెడ్డిదా.? -రేషన్ పంపిణీలో మీ వాటా ఎంత?**

**స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి తీవ్ర ఆగ్రహం**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కేంద్ర ప్రభుత్వం దేశంలోని పేదల కోసం అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని కూడా తమ ఘనతగా ప్రచారం చేసుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో ఫోజులకు దిగడం సిగ్గుచేటని బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కొందుర్గు మండల కేంద్రంలో ఎమ్మెల్యే పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను వ్యతిరేకిస్తూ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రం అందిస్తున్న సంక్షేమాన్ని తమ ఖాతాలో వేసుకుని రాజకీయ ప్రచారం చేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. సొమ్ము కేంద్రానిది.. పథకం కేంద్రానిది..రేషన్ బియ్యం కేంద్రానిది..మరి ఫోటో మాత్రం ముఖ్యమంత్రిదాఅని ప్రశ్నించారు. ప్రజలకు వాస్తవాలు తెలియకుండా కేంద్ర ప్రభుత్వ పాత్రను మరుగునపెట్టి, రాష్ట్ర ప్రభుత్వం చేసినట్లుగా ప్రచారం చేసుకోవడం మానుకోవాలని హెచ్చరించారు.




**స్మార్ట్ రేషన్ కార్డుపై మోదీ ఫోటో లేకపోవడం దురదృష్టకరం**

దేశంలోని పేదలకు ఉచిత రేషన్ అందించడంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. అలాంటి పథకానికి సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫోటో లేకపోవడం రాష్ట్ర ప్రభుత్వ సంకుచిత రాజకీయాలకు నిదర్శనమన్నారుకేంద్రం చేస్తే రాష్ట్రం చేసినట్టు..మోదీ చేస్తే రేవంత్ ఫోజులు.. అంటూ ఘాటుగా విమర్శించారు.
కేంద్ర పథకాలకు కాంగ్రెస్ పార్టీ స్టిక్కర్లు అతికించుకుని రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.కేంద్రం చేస్తున్న సేవలను తమ ఖాతాలో వేసుకోవడం కాదు.. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ప్రజలకు నిజాయితీగా చెప్పాలి.పేదల సంక్షేమ పథకాలను రాజకీయ ప్రచార వేదికలుగా మార్చుకోవడం వెంటనే ఆపాలి అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షులు లక్ష్మీ గౌడ్,కొమరబండ శ్రీశైలం, పర్వతాపూర్ సర్పంచ్ బోయ అశోక్,నాయకులు గుండేటి శివారెడ్డి, సున్నాల అంజయ్య, ప్రధాన కార్యదర్శి చంద్ర ముదిరాజ్,కార్తీక్ యాదవ్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ చారి, రఘునాథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బూత్ అధ్యక్షులు గోపి నర్సింలు, శివకుమార్,గడ్డమీది రవి, చిన్నమయ్య,వెంకటేష్,సుభాన్ రెడ్డి, సురేష్,పవన్ కుమార్ గౌడ్,రవి,దామోదర్ రెడ్డి, శ్రీనివాస్,శివకుమార్,రమేష్, నరేష్ గౌడ్,కృష్ణమాచారి,మల్లేష్,ఎర్ర రవి,మల్లారెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# 1000 రోజుల ప్రజా పాలన

**అభివృద్ధి, సంక్షేమం, మార్పుకు నిదర్శనం..**



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 3/(ప్రజావినికిడి):**
డాక్టర్స్ కాలనీ డివిజన్ ఏఎస్ఆర్ గార్డెన్స్ లో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న లక్ష్మారెడ్డి టీపీసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజుల్లో ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు మహిళలకు ఉచిత బస్సు, రూ.500కే గ్యాస్ సిలిండర్,200 యూనిట్ల ఉచిత విద్యుత్,రేషన్ కార్డులు, ప్రభుత్వ ఉద్యోగాలు,ఇందిరమ్మ ఇండ్లు,సన్న బియ్యం,మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు ఇలాంటివి అనేక సంక్షేమ కార్యక్రమాలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ, తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి అభినందనలు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు,సీనియర్ నాయకులు జంగారెడ్డి ,జనార్ధన్ గౌడ్ ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యూనిస్,డివిజన్ మహిళా అధ్యక్షురాలు అరుణ,నాయకులు ఆసిఫ్ అప్పారావు,అఫ్జల్,హాబీబ్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

## కమ్మదనం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళా కళాశాలలో విషాద ఘటనపై చర్యలు తీసుకోవాలి..

### విద్యార్థి అశ్వినీ మృతిపై పూర్తి నిజాలు వెలుగులోకి రావాలి..

### బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పుట్నాల సాయికుమార్..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కమ్మదనం ఎస్సి గురుకుల వసతి గృహంలో సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థినీ ఆత్మహత్య చేసుకోవడం జరిగింది విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేయాలి.. విద్యార్థులకు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి అన్నారు విద్యార్థి అశ్విని మృతి ఘటనకు సంబంధించిన అసలు కారణాలు ఇప్పటివరకు పూర్తిగా వెలుగులోకి రాలేదని అన్నారు . విద్యార్థి మృతితో తీవ్ర విషాదంలో ఉన్న తల్లిదండ్రులకు న్యాయం జరగాలని ఆయన డిమాండ్ చేశారు.విద్యార్థి మృతికి గల పూర్తి కారణాలను అధికారులు సమగ్రంగా విచారించి నిజా నిజాలను బయటకు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఈ రోజు ధర్నా నిర్వహించడం జరిగింది ఘటనకు సంబంధించిన అంశాలపై పారదర్శకంగా విచారణ జరిపి, బాధ్యులు ఎవరైనా ఉంటే కట్టిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఒక విద్యార్థి మృతి చెందడం అత్యంత బాధాకరమైన విషయమని, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో మళ్ళీ విద్యార్థికీ ఎదురుకాకుండా విద్యాసంస్థల్లో విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు

## సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

### జేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డా. రామారావు



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ పోస్టర్ ను తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (TGEJAC), రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో IDOC, కొంగరకలాన్‌లో ఆవిష్కరించడం జరిగింది.
ఈ సందర్భంగా టీజీజాక్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ కార్యాచరణలో భాగంగా 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ఉద్యోగస్తులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో రంగారెడ్డి జిల్లా టీజీజాక్ కన్వీనర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ ఇప్పుడున్న ప్రభుత్వం అధికారము లోకి వచ్చిన 6 మాసాలలో ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయమని ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, నాలుగవ తరగతి ఉద్యోగులు, కార్మికులు మరియు పెన్షనర్లు అందరూ ఐక్యంగా ముందుకు వచ్చి, తమ నిరసనను బలంగా వినిపిద్దామని తెలియజేసి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగులు,ఉపాధ్యాయులు అలాగే పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సెప్టెంబర్ 10 లో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ నాయకులు కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా కో కన్వీనర్ యమ్. శ్రీను,కో చైర్మన్లు గోపాల్,రమేష్, డేవిడ్,గోపాల్ జి,శాంతి శ్రీ, వైస్ చైర్మన్లు నూతనకంటి వెంకట్,సైదమ్మ, రాకేష్,జమ కుశాల్, మల్లారెడ్డి, రంగయ్య,గోపాల్, వెంకటస్వామి, పరమేష్ , మహేష్, సంతోష్,ప్రమీల, రాణి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ నిబంధనల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల భూములను లాక్కోవడాన్ని తీవ్రంగా ఖండించిన మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 22ఏ (రిజిస్ట్రేషన్ల నిషేధిత భూముల జాబితా) నిర్ణయంపై మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల దశాబ్దాలుగా నివాసం ఉంటున్న సామాన్య ప్రజలు,రైతులు తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ గురువారం రోజు షామీర్పేట్ లోని ఈటెల నివాసంలో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ లోని 118 జి ఒ కు సంబంధించిన అంశంపై చర్చించడం జరిగింది త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తామని ఈటల రాజేందర్ హామీ ఇవ్వడం జరిగింది.

## "బీఆర్ఎస్ పోరుబాట"లో భాగంగా నిరసన కార్యక్రమం

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**



"బీఆర్ఎస్ పోరుబాట" కార్యక్రమం నిర్వహణలో భాగంగా నాగోల్ డివిజన్ పరిధిలోని రాక్ టౌన్ కాలనీ నందు జరిగిన పోరుబాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు తమ జీవితకాల సంపాదనను వెచ్చించి రూపాయి రూపాయి కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి ఆయా భూముల యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు.ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం వారికి న్యాయం చేయకుండా అనేక ఇబ్బందులకు గురిచేస్తుండటం దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.22ఏ సమస్యతో బాధపడుతున్న బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని అక్రమంగా 22ఏ జాబితాలో చేర్చిన భూములను పరిశీలించి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని బాధితులకు న్యాయం జరిగే వరకు "బీఆర్ఎస్ పోరుబాట" కొనసాగుతుందని సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ బారసానాయకుడు అనంతుల రాజిరెడ్డి,డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి,మహేష్ రెడ్డి,సతీష్ యాదవ్,పల్ల శిల్పారెడ్డి,పోచంపల్లి రాజేందర్ రెడ్డి,మద్దెల వినయ్ కుమార్,శ్యాంసుందర్ రెడ్డి,రేవంత్ గౌడ్ చుట్టుపక్కల కాలనీ అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు

# అశ్విని మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం..

### షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ -పాఠశాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు..







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
నియోజకవర్గంలోని కమ్మదనం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో మృతి చెందిన విద్యార్థిని ముడావత్ అశ్విని తమతో చక్కగా మాట్లాడేదని, సంతోషంగా ఉండేదని తోటి విద్యార్థినులు తెలిపారు. అయితే ఆమె తన వ్యక్తిగత విషయాలను ఎవరితోనూ పంచుకునేది కాదని చెప్పారు. అశ్విని మృతికి గల కారణాలు తమకు పూర్తిగా తెలియవని, అయితే ఆత్మహత్యకు ముందు ఆమె ఏడ్చుకుంటూ డార్మెటరీ వైపు వెళ్లడాన్ని కొందరు విద్యార్థినులు చూశారని వెల్లడించారు.
షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల వద్ద పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.పట్టణ సీఐ సీతారాం తదితర పోలీసు అధికారులు విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థినులతో మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. అశ్విని ఆత్మహత్యకు ముందు,
ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలపై విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు అశ్విని గురించి మాట్లాడుతూ, ఆమె తన వ్యక్తిగత విషయాలను ఎవరితోనూ పంచుకునేది కాదని తెలిపారు.తన అక్క విషయంలో మాత్రం బాధపడేదని చెప్పారు.అశ్విని గతంలో కొన్ని అనారోగ్య సమస్యలను ఎదుర్కొందని, ముఖ్యంగా కడుపు నొప్పితో తీవ్రంగా బాధపడేదని,చిన్న సర్జరీ కూడా జరిగిందని విద్యార్థినులు తెలిపారు.
చదువుల్లో హుషారుగా ఉండేందుకు ఆమె ప్రయత్నించేదని పేర్కొన్నారు. అశ్విని ఆత్మహత్య చేసుకున్న రోజు సాయంత్రం నాలుగు గంటల వరకు తమతోపాటే ఉందని,పరీక్ష కూడా రాసిందని విద్యార్థినులు తెలిపారు. పరీక్షలో ఎన్ని మార్కులు వచ్చాయనే విషయం తమకు తెలియదని చెప్పారు. అనంతరం అశ్విని బయటకు వెళ్లిందని, గ్రౌండ్‌లోకి ఏడ్చుకుంటూ డార్మెటరీ వైపు వెళ్లిందని పదో తరగతి విద్యార్థినులు చూశారని తమకు తెలిసిందని తెలిపారు.
అశ్విని ఎందుకు ఏడ్చిందో,దేనికి బాధపడిందో తమకు పూర్తిగా తెలియదని విద్యార్థినులు చెప్పారు. అశ్విని మృతికి సంబంధించి విద్యార్థి సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు విద్యార్థినులు సమాధానాలు ఇచ్చారు.అశ్విని మృతి అనంతరం జరిగిన పరిణామాలపై ఆమె బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.ఘటనకు సంబంధించిన పరిణామాలను తెలుసుకున్న బంధువులు,జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే దృశ్య సినిమాల్లో కనిపించే సన్నివేశాలనుతలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అశ్విని మృతికి అసలు కారణాలు వెలుగులోకి రావాలని,అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరపాలని వారు డిమాండ్ చేశారు.

**అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం.. ఏసీపీ లక్ష్మీనారాయణ**

విద్యార్థి సంఘాలు,గిరిజన నాయకులతో షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడారు. విద్యార్థి సంఘాలు,విద్యార్థులు, అధ్యాపకులు లేవనెత్తిన అంశాలన్నింటినీ పోలీసులు పరిగణనలోకి తీసుకుంటారని ఆయన తెలిపారు.అశ్విని మృతిపై బంధువులు చేసిన ఫిర్యాదులను కూడా స్వీకరించి, వాటి ఆధారంగా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని స్పష్టం చేశారు.అశ్విని మృతి ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని ఏసీపీ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక కూడా రానుందని,దాని ఆధారంగా నిష్పక్షపాతంగా విచారణ కొనసాగిస్తామని చెప్పారు. ఘటనలో ఎవరి ప్రమేయం ఉన్నా, ఇతర కారణాలు ఏవైనా వెలుగులోకి వచ్చినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.గురుకులంలో చదువుకుంటున్న మిగతా విద్యార్థులు ధైర్యంగా ఉండి, తమ చదువును కొనసాగించేలా అన్ని వర్గాలు సహకరించాలని ఏసీపీ లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల భద్రత,వారి మానసిక స్థైర్యానికి అన్ని వర్గాలు అండగా నిలవాలని కోరారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు సంఘటనపై ఆరా తీశారు.

## మహిళా కానిస్టేబుల్ పై అసభ్యక మాటలతో దూషించిన డాక్టర్ పైన ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని హాస్పిటల్ ముందు గిరిజన సంఘాల దర్నా..





మాన్సురాబాద్ సహారా హాస్పిటల్ ముందు ఆందోళన చేస్తున్న గిరిజన, లంచడి సంఘాల నాయకులు..

**పీఎస్ లో ఫిర్యాదు చేసిన కానిస్టేబుల్..**

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
గత రెండు రోజుల క్రితం ఎల్బీనగర్ శ్రేష్ట ఆరెంజ్ హాస్పిటల్ యాజమాన్యానికిసహారా హాస్పిటల్ మధ్య జరిగిన వివాదంలో బందోబస్తు కొచ్చిన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో విధులలో ఉన్న గిరిజన మహిళా కానిస్టేబుల్ పై తీవ్ర మైనటువంటి పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేసిన సహారా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంకురి శెట్టి నరేష్ పై, అతని అనుచరులపై వెంటనే ఎస్సీ. ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గురువారం మాన్సురాబాద్ లో ని సహారా హాస్పిటల్ ముందు పలువురు గిరిజన సంఘాల నాయకులు, గిరిజన విద్యార్థి సంఘాల ఆందోళన చేపట్టారు. సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎల్బీనగర్ లోని శ్రేష్ట ఆరెంజ్ హాస్పిటల్ యాజమాన్యానికి,సహారా హాస్పిటల్ ఎండీ డాక్టర్ సుంకురి శెట్టి నరేష్ తదితరులకు మధ్య గత కొత్త కాలంగా ఆర్థిక లావాదేవీల విషయంపై వివాదం కొనసాగుతుంది. ఈ విషయంలో కోర్టులో నడుస్తుంది.ఈ క్రమంలో మంగళవారం నరేష్ తన అనుచరులతో కలిసి తర కోర్టు ఆర్డర్ ఉందని ఆరెంజ్ హాస్పిటలకు వచ్చాడు.ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. సమచారం అందుకున్న ఎల్బీనగర్ పోలీసులు అక్కడికి బందోబస్తుకు వచ్చారు. అక్కడ ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా చద్రతా చర్యలు డేపట్టారు. అక్కడ విధుల్లో ఉన్న ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ కు చెందిన గిరిజన కానిస్టేబులు నంద్యబాయిపై డాక్టర్ నరేష్ తీవ్రంగా దూషిస్తూ. అత్యంత అభ్యంతరమైన. పురుష పదజాలంతో దూషించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈమేరకు మహిళా కానిస్టేబుల్ సంధ్య బాయి ఈ విషయంపై డాక్టర్ నరేష్పా ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ విషయం పోలీసులు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. లీగల్ ఓపీనియన్ తీసుకుని కేసు దర్యాప్తు చేస్తామని ఎల్ నగర్ పోలీసులు తెలిపారు.ఈ విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ లో గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు నరేష్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరూతూ మాన్సురాబాద్ లోని సహారా హాస్పిటల్ కు మందు పెద్ద ఎత్తున్న ఆందోళర చేపట్టారు. పోలీసులు ఉన్నత అధికారులు వెంటనే స్పందించి మహిళా కానిస్టేబుల్ పై సభ్య సమాజం తలదించుకొనే విధంగా పరుష పదజాలంతో వ్యాఖ్యాలు చేసిన నరేష్ పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆనంతరం వనస్థలిపురం ఏసీపీ కార్యాలయంలో గిరిజన సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు భరత్నాయక్. పున్నిబాయి, దీప్లానాయక్, శ్రీకాంత్ నాయక్. వాసు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలను శాంతియుతంగా, ఘనంగా నిర్వహించాలి,

### జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**రంగారెడ్డి**
గణేష్ వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా, సురక్షితంగా ఉత్సవాలు నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో గణేష్ చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ డా. కె. కిరణ్మయితో కలిసి డీసీపీలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై, 24న నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో పాటు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. గణేష్ శోభాయాత్ర మార్గాల్లో గుంతలు, దెబ్బతిన్న రహదారులకు ప్యాచ్‌వర్క్ చేపట్టాలని, నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, బారికేడింగ్, వేదికలు, మొబైల్ టాయిలెట్లు, తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.విగ్రహాల ఊరేగింపు సమయంలో వాహనాల్లో యాంత్రిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాలని, నిమజ్జన మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన చెట్లు తదితర ప్రమాదకర అంశాలను తొలగించాలని తెలిపారు. చెరువుల వద్ద అవసరమైన సంఖ్యలో క్రేన్లు, బారికేడింగ్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్య, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు, కంట్రోల్ రూమ్, వేగవంతమైన స్పందన వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎక్కడైనా సమస్య తలెత్తిన వెంటనే స్పందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి ప్రమాదాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కోరారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, నిమజ్జన ప్రదేశాల్లో తగినన్ని క్రేన్లు, నిరంతర విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి స్టేట్ ఎగ్జిక్యూటివ్ రవీందర్ రెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి చైర్మన్ కె.నిరంజన్, సెక్రెటరీ సాయికిరణ్ చారి, వైస్ ప్రెసిడెంట్ టి.ఆనంద్ గౌడ్, ఆర్డీఓలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# కూతురి రాజకీయ భవితవ్యం కోసమే!

**సెప్టెంబర్ 3:(ప్రజావినికిడి):**
నేడు రాష్ట్ర రాజకీయాలు కొండా ఫ్యామిలీ చుట్టూ తిరుగుతున్నాయి. ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో.. అధిష్టానం ఎటువైపుగా అడుగులు వేస్తుందో అని ఉత్కంటగా ఎదురు చూస్తున్నారు. కానీ కొండా దంపతులు తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బీసీ వర్గాల్లోని బలం, ప్రజా మద్దతును ఉపయోగించి కూతురికి స్వతంత్ర రాజకీయ వేదికను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టుగా కూడా చర్చ జరుగుతోంది. కొత్త వేదిక ద్వారా ఆమెకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం అజెండాగా కొత్త రాజకీయ శక్తిని నిర్మించే ప్రయత్నం కూడా ఈ కోణంలోనే చూడవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొండా సురేఖ రాజీనామా వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. కొండా సురేఖ మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలని, లేదంటే పార్టీ నుండి బర్తరఫ్ చేస్తామని పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేయటంతో కొండా కపుల్ రాజకీయ భవితవ్యం గందరగోళంలో పడింది. కూతురు చేసిన వ్యాఖ్యలు కొండా సురేఖ రాజకీయ జీవితాన్ని మార్చేస్తుంది అన్న చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. చాలా కాలంగా కొండా కపుల్ తమ కుమార్తె పొలిటికల్ ఎంట్రీ కోసం ప్రయత్నం చేస్తున్నారు. గతంలోనూ బీఆర్ఎస్ లో ఉన్న సమయంలో కూడా కొండా సుస్మితకు టికెట్ కావాలని అధిష్టానం మీద ఒత్తిడి తెచ్చారు. కొండా సుస్మిత తన తల్లిదండ్రుల రాజకీయ వారసత్వాన్ని కొనసాగించాలనే



ఆలోచనతో పరకాల నియోజకవర్గంపై గంపెడు ఆశలు పెట్టుకుంది. అయితే ఇటీవల సీఎం రేవంత్ పరకాలలో మళ్ళీ టికెట్ రేవూరి ప్రకాష్ రెడ్డికే అని ప్రకటన చేయటంతో సుస్మిత ఆశలమీద నీళ్ళు చల్లినట్టు అయ్యింది. దీంతో పొలిటికల్ ఫ్యూచర్ పైన ఆందోళనలో ఉన్న కొండా సుస్మిత సీఎం రేవంత్ రెడ్డిని తీవ్రస్థాయిలో టార్గెట్ చేశారు. సీఎంపై సుస్మిత చేసిన విమర్శలు పార్టీలో తీవ్ర అలజడి సృష్టించాయి. దీనితో కొండా సురేఖపై షోకాజ్ నోటీసు, పదవి నుంచి తొలగించాలనే డిమాండ్‌లు వచ్చాయి. అయితే కొండా దంపతులు తమ కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తాము బాధ్యులు కాదని, ఆమె స్వతంత్ర వ్యక్తి అని స్పష్టం చేశారు. వారు కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కానీ కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించలేదు. ఒకవేళ అదే చేస్తే కూతురికి రాజకీయంగా అనవసరపు ఇబ్బంది వస్తుందని, కూతురి కోసం పోరాటమే చెయ్యాలని నిర్ణయం తీసుకున్నారు. కొండా దంపతులు తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బీసీ వర్గాల్లోని బలం, ప్రజా మద్దతును ఉపయోగించి కూతురికి స్వతంత్ర రాజకీయ వేదికను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టుగా కూడా చర్చ జరుగుతోంది. కొత్త వేదిక ద్వారా ఆమెకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం అజెండాగా కొత్త రాజకీయ శక్తిని నిర్మించే ప్రయత్నం కూడా ఈ కోణంలోనే చూడవచ్చు. తల్లిదండ్రులు తమ బిడ్డ రాజకీయ భవిష్యత్తు కోసం తమ పదవి, పార్టీలోని స్థానం, దశాబ్దాలుగా నిర్మించుకున్న రాజకీయ జీవితాన్ని రిస్క్ చేయటం మామూలు విషయం కాదు. కానీ కొండా దంపతులు ఈ రిస్క్ చేశారు. ఏదేమైనా ఎదో ఒక రచ్చతో నిత్యం ప్రజల మధ్యన హాట్ టాపిక్ గా నిలుస్తూ కొత్త రకం ప్రచారానికి తెర తీస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఊపందుకుంటున్నాయి. మంత్రివర్గం నుండి కొండా సురేఖకు ఉద్వాసన పలుకుతున్న క్రమంలో కొండా దంపతుల రాజకీయ భవితవ్యంపైన చర్చ జరుగుతోంది. మొదట నుండి వివాదాస్పదులే అయినప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బలమైన కేడర్, వరంగల్ లో బలమైన పట్టు, ఉన్న మంత్రి కొండా సురేఖ, కొండా మురళీ దంపతులు నూతన రాజకీయ శక్తిగా ఆవిర్భవించేందుకు సమాయత్తమవుతున్నారనే వార్తలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్నాయి. బీసీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవమే ప్రధాన అజెండాగా వారు ఈ నిర్ణయం తీసుకోబోతున్నారని వారి అనుచరులు, శ్రేయోభిలాషులు చెబుతున్నారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ సామాజిక వర్గాల ఆత్మగౌరవ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా వారు వ్యూహ రచన చేస్తున్నారని సమాచారం. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, పుష్కలమైన ప్రజా మద్దతు, అంగబలం, ఆర్థిక బలం తమకు అనుకూలంగా ఉన్నాయని కొండా దంపతులు భావిస్తున్నారు.ప్రస్తుతం బీసీ మేధావులు, శ్రేయోభిలాషులు, మద్దతుదారులతో విస్తృత స్థాయిలో సమాలోచనలు కొనసాగుతున్నాయి. కొండా దంపతుల నిర్ణయం బీసీల ఏకీకరణకు ఇది మంచి అవకాశం అని వారి మద్దతుదారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో మెజారిటీ జనాభా ఉన్న బీసీ వర్గాలను ఒకే వేదికపైకి తెచ్చి, వారికి తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు ఈ చర్య దోహదపడుతుందని అంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో టికెట్లు దక్కక నిరాశలో ఉన్న సమర్థులైన నాయకులకు అవకాశం కల్పించి, వారిని గెలిపించుకునే వ్యూహంతో ముందుకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. కోదండరామ్, కవిత, తీన్మార్ మల్లన్న వంటి నాయకులు స్వంత వేదికల ద్వారా గుర్తింపు పొందినట్లే, దశాబ్దాలుగా ప్రజాదరణ ఉన్న తాము కూడా స్వతంత్రంగా ముందుకు రావాలనే ఆలోచన కొండా దంపతుల్లో ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. ప్రకటన అనంతరం నేరుగా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు కూడా ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరి కొండా దంపతులు కొత్త రాజకీయ పార్టీ పెడితే వారి వెంట నడిచేవారు ఎందరు? వారు ఈ ప్రయత్నంలో సక్సెస్ అవుతారా అన్న చర్చ కూడా సాగుతుంది. అయితే, దీనిపై కొండా కుటుంబం నుండి అధికారిక ప్రకటన ఇంకా రాలేదు.

# ధర్మానికి దారి చూపిన దివ్య సందేశం

**సెప్టెంబర్ 3:(ప్రజావినికిడి):**
భారతీయ సంస్కృతిలో శ్రీకృష్ణ జన్మాష్టమికి ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. శ్రీమహావిష్ణువు ఎనిమిదవ అవతారంగా భావించే శ్రీకృష్ణుడు జన్మించిన పవిత్ర దినాన్ని భక్తులు కృష్ణాష్టమిగా జరుపుకుంటారు. శ్రావణ బహుళ అష్టమి రోజున, రోహిణి నక్షత్రంలో శ్రీకృష్ణుడు మథురలో దేవకీవసుదేవులకు జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి.

కంసుని అరాచక పాలనతో ప్రజలు బాధపడుతున్న సమయంలో ధర్మాన్ని రక్షించేందుకు, దుష్టశక్తులను సంహరించేందుకు శ్రీకృష్ణుడు అవతరించాడు. జన్మించిన వెంటనే వసుదేవుడు బాలకృష్ణుడిని యమునా నది దాటి గోకులంలోని నందయశోదల ఇంటికి చేర్చాడు. అక్కడ పెరిగిన బాలకృష్ణుడు తన చిలిపి చేష్టలు, వెన్న దొంగతనాలు, గోపికలతో ఆటపాటలతో అందరి మనసులను గెలుచుకున్నాడు.

శ్రీకృష్ణుడి జీవితం కేవలం అద్భుతాలు, లీలల సమాహారం మాత్రమే కాదు. ప్రతి దశలోనూ మానవాళికి ఒక గొప్ప సందేశాన్ని అందించింది. గోవర్ధనగిరిని ఎత్తి ప్రజలను రక్షించడం ద్వారా ప్రకృతిని గౌరవించాల్సిన అవసరాన్ని తెలియజేశాడు. కాళీయ మర్దనం ద్వారా చెడుపై మంచి సాధించే విజయాన్ని చాటిచెప్పాడు. స్నేహానికి ప్రతీకగా కుచేలుడితో ఆయన అనుబంధం చిరస్థాయిగా నిలిచింది.మహాభారత యుద్ధ సమయంలో అర్జునుడికి



శ్రీకృష్ణుడు చేసిన గీతోపదేశం ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచింది. "ఫలితాన్ని ఆశించకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించాలి" అనే కర్మయోగ సందేశం నేటికీ ప్రతి మనిషి జీవితానికి అన్వయించదగినది. పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నా ధర్మాన్ని విడిచిపెట్టకూడదని, సత్యం కోసం నిలబడాలని భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు బోధించాడు.

కృష్ణాష్టమి రోజున దేశవ్యాప్తంగా ఆలయాలు ప్రత్యేకంగా అలంకరించబడతాయి. భక్తులు ఉపవాసాలు పాటిస్తూ శ్రీకృష్ణునికి పూజలు చేస్తారు. చిన్నారులను బాలకృష్ణుడు, రాధ వేషధారణల్లో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇళ్ల ముందు చిన్న చిన్న కృష్ణపాదాలను వేసి, బాలగోపాలుడు తమ ఇంటికి వస్తున్నాడనే భావనతో భక్తులు ఆనందంగా పండుగను జరుపుకుంటారు. ఉట్టి కొట్టడం వంటి సంప్రదాయ కార్యక్రమాలు కూడా కృష్ణాష్టమి వేడుకల్లో ప్రత్యేకతను సంతరించుకుంటాయి.

శ్రీకృష్ణుడి జీవితాన్ని మనం పరిశీలిస్తే ప్రేమ, స్నేహం, ధైర్యం, వివేకం, ధర్మం, కర్తవ్యనిష్ఠ వంటి ఎన్నో విలువలు కనిపిస్తాయి. అందుకే కృష్ణాష్టమి అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు; మన జీవితాన్ని సన్మార్గంలో నడిపించే విలువలను గుర్తుచేసుకునే పవిత్ర సందర్భం.

ఈ శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని బోధనలను ఆచరిస్తూ, ప్రేమతో జీవిస్తూ, ధర్మం వైపు అడుగులు వేయడమే ఆయనకు మనం అందించే నిజమైన భక్తి.

"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారతడ
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే."

### హైదరాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం..

# 'గంజా క్వీన్' నీతూ బాయిపై ఈడీ రైడ్స్

**సెప్టెంబర్ 3:(ప్రజావినికిడి):**
గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కీలక నిందితురాలిగా ఉన్న నీతూ బాయి అలియాస్ 'గంజా క్వీన్'కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. నీతూ బాయి, ఆమె అనుచరులతో సంబంధం ఉన్న నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడులు నగరంలో కలకలం రేపాయి.



తెలంగాణ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం 'ఈగల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గతంలో నీతూ బాయి, ఆమె ముఠాపై నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ విచారణను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 'నశా ముక్త్ భారత్' ప్రచారంలో భాగంగా మాదకద్రవ్యాల కేసులపై కేంద్ర ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ సోదాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన పలు కేసుల్లో నీతూ బాయి పరారీలో ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి. ఈగల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసిన ఈడీ, గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన అక్రమ ఆదాయం, దానిని ఎలా మళ్లించారనే దానిపై దృష్టి సారించింది. ముఖ్యంగా ఈ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన కోట్లాది రూపాయలను హవాలా మార్గాల్లో తరలించినట్లు ఈడీ బలంగా అనుమానిస్తోంది. గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుతో అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఈ సోదాల్లో భాగంగా అక్రమ ఆర్జనలకు సంబంధించిన ఆధారాలు, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఇతర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గంజాయి వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బును కుటుంబ సభ్యులు లేదా బినామీల పేర్లతో స్థిరాస్తులు, ఇతర ఆస్తులలో పెట్టుబడిగా పెట్టారా అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు. నానక్‌రామ్‌గూడలోని లోధా బస్తీలో ఉన్న నీతూ బాయి నివాసం, గంజాయి రిటైల్ అమ్మకాలకు అడ్డాగా మారిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఆమె భర్త మున్నా సింగ్, కుమారులు గౌతమ్, గోవింద్, కుమార్తె ఈ వ్యాపారంలో పాలుపంచుకుంటూ గంజాయి ప్యాకింగ్, అమ్మకాలలో సహాయం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఈగల్ అధికారులు జరిపిన దాడుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో సహా పలువురు బానిసలు ఆమె ఇంటి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. అయితే, పలు కేసుల్లో నిందితురాలిగా ఉన్నప్పటికీ నీతూ బాయి అధికారులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతోంది. 2024లో సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ఆమె నివాసంపై దాడి చేసి 20 కిలోల గంజాయి, రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. సోదాలు ముగిసిన తర్వాత ఈ దర్యాప్తునకు సంబంధించిన పూర్తి వివరాలను ఈడీ వెల్లడించే అవకాశం ఉంది.

**డబ్ల్యూఎంఓ సంచలన హెచ్చరిక..**
**భారత్‌కు మరో వాతావరణ ముప్పు**

**100 శాతం కొనసాగింపు అవకాశముందని డబ్ల్యూఎంఓ అంచనా**

**2026 చివరికి తీవ్ర స్థాయికి చేరే అవకాశం**

**పసిఫిక్ సముద్రంలో అసాధారణ వేడి**

**భారత్‌లో ఇప్పటికే 16 శాతం వర్షపాతం లోటు**

**దేశంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం**

**వ్యవసాయం, నీటి వనరులపై ఒత్తిడి ముప్పు**

# 2027 వరకు ఎల్‌నినో..

**సెప్టెంబర్ 3: (ప్రజావినికిడి):**
వాతావరణ మార్పులపై 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యూఎంఓ) కీలక హెచ్చరిక చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం వేగంగా బలపడుతోందని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఇది చాలా తీవ్ర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు.. ఎల్‌నినో ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు 100 శాతం అవకాశం ఉందని తాజా అంచనాలో వెల్లడించింది.

సెప్టెంబర్ 3న విడుదల చేసిన తాజా నివేదికలో డబ్ల్యూఎంవో ఇంతటి అధిక స్థాయి విశ్వాసంతో ఎల్‌నినో కొనసాగింపుపై అంచనా వేయడం ఇదే తొలిసారి. పసిఫిక్ సముద్ర ఉపరితలంతో పాటు లోతైన జలాల్లోనూ అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి ఎల్‌నినో మరింత బలపడేందుకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి.

**పసిఫిక్‌లో అసాధారణ వేడి**
ఎల్‌నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ ప్రక్రియ. దీని ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాదు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల తీరును మార్చగలదు.

ఎల్‌నినోను పర్యవేక్షించే కీలక ప్రాంతమైన నినో 3.4లో మే నుంచి జులై 2026 వరకు సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. జులైలో ఈ తేడా 2 డిగ్రీలకు చేరింది. జులై చివరి నుంచి ఆగస్టు మధ్య వరకు వారపు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.2 నుంచి 2.6 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదయ్యాయి.



సముద్రం అడుగుభాగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. జులై, ఆగస్టు ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 8 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో 2026 చివరి నాటికి ఎల్‌నినో చాలా బలమైన స్థాయికి చేరుకోవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేస్తోంది.

**భారత్‌పై ఎలాంటి ప్రభావం?**
ఎల్‌నినో ప్రభావం అన్ని దేశాల్లో ఒకేలా ఉండదు. అయితే భారత్‌కు ఇది కీలకమైన వాతావరణ సంకేతం. సాధారణంగా ఎల్‌నినో బలపడిన సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉంటుంది. ఫలితంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడొచ్చు.

భారత్‌లో 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ఆందోళనకర అంచనా ఇచ్చింది. మేలో విడుదల చేసిన అంచనాలో సీజన్ మొత్తం వర్షపాతం దీర్ఘకాల సగటులో 90 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం 60 శాతంగా అంచనా వేసింది.

ఆ అంచనాలకు అనుగుణంగానే ఆగస్టు ముగిసే నాటికి దేశంలో వర్షపాతం 16 శాతం లోటుగా నమోదైంది.

**వేడి, కరవు.. కొన్ని చోట్ల భారీ వర్షాలు!**
ఎల్‌నినో బలపడటంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో తీవ్రమైన వేడి, కరవు, వరదల ముప్పు పెరగొచ్చని డబ్ల్యూఎంఓ హెచ్చరిస్తోంది. సెప్టెంబర్-నవంబర్ మధ్య దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అయితే వర్షపాతం మాత్రం ప్రాంతాన్ని బట్టి మారుతుందని తెలిపింది.

భారత్‌పై ఎల్‌నినో ప్రభావాన్ని ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ సమయంలో పాజిటివ్ ఐఓడీ ఏర్పడే అవకాశం ఉందని అంచనా. దీంతో ఎల్‌నినో వల్ల భారత్‌లో సాధారణంగా కనిపించే ప్రభావాల్లో కొంత మార్పు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు.

**వ్యవసాయం నుంచి నీటి వనరుల వరకు..**
ఎల్‌నినో 2027 ప్రారంభం వరకు కొనసాగితే దాని ప్రభావం ఒక్క సీజన్‌కే పరిమితం కాకపోవచ్చు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్యుత్, నీటి వనరుల వంటి వాతావరణంపై ఆధారపడే రంగాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.

అందుకే ప్రభుత్వాలు, వాతావరణ సంస్థలు ముందస్తు హెచ్చరికలు, విపత్తు సన్నద్ధత చర్యలను మరింత బలోపేతం చేయాలని డబ్ల్యూఎంఓ సూచిస్తోంది.

# దీపికను వెనక్కి నెట్టి.. దేశంలోనే నంబర్ 1 హీరోయిన్‌గా నిలిచిన రష్మిక మందన్న






భారత చలనచిత్ర పరిశ్రమలో సరికొత్త అధ్యాయం మొదలైంది. కన్నడ చిత్రసీమ నుంచి ప్రయాణం మొదలుపెట్టి పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన రష్మిక మందన్న, తాజాగా దేశంలోనే నంబర్ 1 హీరోయిన్‌గా నిలిచారు. ఇటీవల వెలువడిన జాతీయ స్థాయి పాప్యులారిటీ ర్యాంకింగ్‌లో, బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపిక పదుకొణెను వెనక్కి నెట్టి రష్మిక ఈ ఘనత సాధించినట్లు తెలుస్తోంది. ఇది ఆమె కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది. 'పుష్ప: ది రైజ్' చిత్రంలో ఆమె పోషించిన శ్రీవల్లి పాత్ర దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి, ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత వచ్చిన 'యానిమల్' సినిమాతో హిందీ ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ఇటీవల విడుదలైన 'పుష్ప 2: ది రూల్' ఆమె మాస్ ఇమేజ్‌ను, క్రేజ్‌ను శిఖర స్థాయికి చేర్చింది. దీంతో పాటు 'ఛావా', 'కుబేర' వంటి విభిన్న భాషల చిత్రాలతో తన నటనను, ఉనికిని అన్ని పరిశ్రమలలోనూ బలంగా చాటుకున్నారు.రష్మిక విజయం కేవలం గత చిత్రాలకే పరిమితం కాలేదు. భవిష్యత్తులోనూ ఆమె డైరీ అగ్రశ్రేణి ప్రాజెక్టులతో నిండిపోయింది. రాబోయే అక్టోబర్ 16న విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న 'రణబాలి' విడుదల కానుండగా, నవంబర్ 27న 'మైసా' ప్రేక్షకుల ముందుకు రానుంది. వీటితో పాటు 'రాకా', 'పుష్ప 3', 'యానిమల్ పార్క్' వంటి భారీ బడ్జెట్ చిత్రాలు కూడా ఆమె ఖాతాలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ ఆమెను దేశంలోనే అత్యంత బిజీగా ఉన్న నటీమణులలో ఒకరిగా నిలబెట్టాయి.

రష్మిక అగ్రస్థానానికి చేరడం అనేది భారతీయ సినిమాలో మారుతున్న సమీకరణాలకు నిదర్శనం. ప్రాంతీయ భాషా చిత్రాల సరిహద్దులు చెరిగిపోయి, ప్రతిభ ఉన్న నటీనటులకు దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తోందనడానికి ఆమె విజయమే ఒక ఉదాహరణ. దీపిక పదుకొణె ఇప్పటికీ ఒక ఐకాన్‌గా కొనసాగుతున్నప్పటికీ, పలు భాషల్లో వరుస విజయాలు సాధించి, పాన్ ఇండియా స్టార్‌డమ్‌కు కొత్త నమూనాను సృష్టించారు రష్మిక. ఆమె ప్రయాణం ఆధునిక స్టార్‌డమ్ భాషకు అతీతమని స్పష్టం చేస్తోంది.

# విడుదలకు ముందే సక్సెస్‌మీట్..

## 'రంభ ఊర్వశి మేనక'పై అల్లరి నరేశ్ ఫుల్ కాన్ఫిడెన్స్



కథానాయకుడు అల్లరి నరేశ్ చాలా కాలం తర్వాత తనదైన శైలిలో ఫాంటసీ కామెడీ జోనర్‌లో నటించిన చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. ఈ సినిమా విజయంపై ఆయన పూర్తి ధీమా వ్యక్తం చేశారు. చిత్రం విడుదలకు ముందే సక్సెస్ మీట్ తేదీని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సెప్టెంబర్ 4న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నరేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ కార్యక్రమంలో నరేశ్ మాట్లాడుతూ.. "ఈసారి కచ్చితంగా పెద్ద హిట్ కొడుతున్నాం. సినిమా సెప్టెంబర్ 4న విడుదలవుతుంది, సెప్టెంబర్ 9న సక్సెస్ మీట్ నిర్వహిస్తాం" అని ఎంతో ఆత్మవిశ్వాసంతో పేర్కొన్నారు. 'నాంది' చిత్రం తర్వాత తనకు సోలోగా ఆశించిన విజయం లభించలేదని అంగీకరించిన ఆయన, ఈ సినిమాతో ఆ లోటు తీరుతుందని స్పష్టం చేశారు. ఈ చిత్రంలో నరేశ్ వీకే కూడా కీలక పాత్ర పోషించడంతో ప్రేక్షకులకు వినోదం రెట్టింపు అవుతుందని హామీ ఇచ్చారు.అక్కినేని నాగార్జున నిర్మాణంలో కథానాయకుడిగా నటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే, నిర్మాతలు నిమ్మకాయల ప్రసాద్, రాజేశ్ దండా, దర్శకుడు చంద్ర మోహన్ చింతాడలకు కృతజ్ఞతలు తెలిపారు. కథానాయికలు రాశీ సింగ్, విష్ణు ప్రియా, ప్రషా సింగ్‌లు తమ పాత్రల్లో ఎంతో ఉత్సాహంగా నటించారని ప్రశంసించారు. గత కొన్నేళ్లుగా వైవిధ్యమైన సీరియస్ పాత్రలు చేస్తున్న తాను, తిరిగి పూర్తిస్థాయి కామెడీతో ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉందని నరేశ్ పేర్కొన్నారు.



# చేతిలో కొడవలి.. కమల్ కొత్త గేమ్ మొదలైంది!

'థగ్ లైఫ్' తర్వాత కమల్ హాసన్ హీరోగా ఏ సినిమా ముందుగా సెట్స్‌పైకి వెళ్తుందనే విషయంలో కొంత గ్యాప్ వచ్చింది. అన్బరివ్ దర్శకత్వంలో ఒక సినిమా ప్రకటించినా అది వెంటనే మొదలుకాలేదు. రజనీకాంత్‌తో చేయాల్సిన మరో ప్రాజెక్ట్ కూడా లైన్లో ఉంది. ఈ మధ్యలో ఎస్ యూ అరుణ్ కుమార్‌తో కొత్త సినిమాను కమల్ ప్రకటించారు. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ కూడా ఒకేసారి బయటకు వచ్చింది.ూశ్రీంశీ =ముఎ - కరీనా కపూర్ చదువుకుంది ఇంటరేనా? ఆ ఫోటోలో కమల్ చేతిలో పెద్ద కొడవలి పట్టుకుని కనిపించారు. బ్లాక్ షర్ట్, ఆలివ్ గ్రీన్ ప్యాంట్, గ్రే హెయిర్‌తో సింపుల్‌గానే ఉన్నా క్యారెక్టర్ మాత్రం రఫ్‌గా ఉండబోతోందనే ఫీలింగ్ ఇచ్చారు. సినిమా టైటిల్, కథ, పాత్ర గురించి ఇంకా ఏమీ చెప్పలేదు. కానీ రెగ్యులర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ కాకుండా డైరెక్ట్ గా కమల్ క్యారెక్టర్ లుక్‌తో ప్రాజెక్ట్‌ను పరిచయం చేయడం వల్ల మొదటి అప్డేట్‌కే కొంత క్యూరియాసిటీ వచ్చింది. అరుణ్ కుమార్ ఈసారి ఎలాంటి కథతో వస్తాడనే క్యూరియాసిటి కూడా పెరిగింది. పన్నయ్యారుమ్ పద్మినియుమ్, సేతుపతి, చిత్తా, వీర ధీర సూరన్ లాంటి సినిమాలు వచ్చాయి. ముఖ్యంగా స్టార్ హీరో ఉన్నా కథలో పాత్రకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే దర్శకుడిగా ఆయనకు పేరు వచ్చింది. విక్రమ్‌తో చేసిన 'వీర ధీర సూరన్' తర్వాత ఇప్పుడు కమల్ హాసన్‌ను డైరెక్ట్ చేసే అవకాశం దక్కింది.

# దీపావళికి ప్రభుదేవా 'మూన్‌వాక్'...

## నటుడిగా ఏఆర్ రెహమాన్ అరంగేట్రం!




తమిళంతో పాటు తెలుగు, హిందీలో ఒకేసారి విడుదల ప్రముఖ నటుడు, నృత్య దర్శకుడు ప్రభుదేవా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మూన్‌వాక్' ఈ ఏడాది దీపావళి కానుకగా విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్రబృందం బుధవారం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించడమే కాకుండా, తొలిసారి వెండితెరపై నటుడిగానూ మెరవనున్నాడు. ఇందులో ఆయన ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.

మనోజ్ ఎన్.ఎస్. దర్శకత్వంలో బిహైండ్‌వుడ్స్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. వినోదం, సంగీతం, నృత్యం ప్రధానాంశాలుగా సాగే ఈ సినిమాను ఒక సంపూర్ణ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించినట్లు చిత్రబృందం పేర్కొంది. ఇందులో ప్రముఖ హాస్యనటుడు యోగిబాబు ఏకంగా 16 విభిన్న పాత్రలు పోషిస్తుండటం విశేషం. అజు వర్గీస్, అర్జున్ అశోకన్, నిష్మా, సుస్మిత, రెడ్డిన్ కింగ్స్లీ, మొట్టై రాజేంద్రన్ వంటి భారీ తారాగణం ఈ చిత్రంలో నటిస్తున్నారు.

పండుగ వాతావరణంలో కుటుంబ సభ్యులందరూ కలిసి చూసేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దామని దర్శకుడు మనోజ్ వెల్లడించాడు. "దీపావళి పండుగ కుటుంబాల మధ్య అనుబంధాన్ని పెంచుతుంది. మా 'మూన్‌వాక్' సినిమా కూడా అదే తరహాలో నవ్వులు, నాట్యం, సంగీతంతో కూడిన ఒక వేడుకలా ఉండాలని ఆశిస్తున్నాం" అని ఆయన వివరించాడు. ఇప్పటికే విడుదలైన 'యేతు', 'టింగా', 'మకరీనా' పాటలకు శ్రోతల నుంచి అద్భుతమైన స్పందన లభించగా, త్వరలో ప్రభుదేవా, ఏఆర్ రెహమాన్ కలిసి కనిపించనున్న 'మయిలే' అనే నాలుగో గీతాన్ని విడుదల చేయనున్నారు.

తమిళంతో పాటు తెలుగు, హిందీ భాషల్లోనూ ఈ చిత్రం ఏకకాలంలో విడుదల కానుంది. అనూప్ వి. శైలజ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, రోమియో పిక్చర్స్ ప్రపంచవ్యాప్తంగా పంపిణీ హక్కులను, లహరి మ్యూజిక్ ఆడియో హక్కులను సొంతం చేసుకున్నాయి.

# చిన్నగా మొదలైన హిందీ హనుమాన్.. ఇప్పుడు హోంబలేతో..




'హనుమాన్ అంష్' పేరు తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం ఉండకపోవచ్చు. ఇది ఆగస్టు 7న హిందీలో విడుదలైన చిన్న బడ్జెట్ భక్తి చిత్రం. నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా విశాల్ చతుర్వేది తెరకెక్కించారు. పెద్ద స్టార్ కాస్ట్ లేదు, భారీ ప్రమోషన్ కూడా జరగలేదు. మొదటి రోజు ఇండియాలో రూ.10 లక్షల దగ్గరే ఓపెన్ అయింది. కానీ అక్కడి నుంచి మౌత్ టాక్‌తో సినిమా ఊహించని రేంజ్‌లో పెరిగింది. ఇప్పుడు అదే సినిమా ఓవర్సీస్ రిలీజ్‌కు సిద్ధమైంది. దాదాపు రూ.2 కోట్ల బడ్జెట్‌తో తీసిన 'హనుమాన్ అంష్' నాలుగో వారం వరకు థియేటర్లలో నిలబడింది. 27 రోజులకు ఇండియా నెట్ రూ.61 కోట్లకు పైగా చేరినట్టు ట్రేడ్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. మొదటి వారం నెమ్మదిగా వెళ్లిన సినిమా, తర్వాతి రోజుల్లో కలెక్షన్స్ పెంచుకుంది. పెట్టిన బడ్జెట్‌తో పోలిస్తే చాలా పెద్ద రిటర్న్ రావడంతో ఒక్కసారిగా బాలీవుడ్‌లో ఈ సినిమా గురించి మాట్లాడటం మొదలైంది. సినిమా నీమ్ కరోలి బాబా భక్తి, సేవ, హనుమంతుడిపై ఉన్న నమ్మకం చుట్టూ సాగుతుంది. 'డివైన్ డీటూర్' అనే పుస్తకం ఆధారంగా కథను తీసుకున్నారు. శోభినవ్ సత్యా ప్రధాన పాత్రలో నటించారు. ఇప్పటివరకు హిందీ మార్కెట్‌లోనే నడిచిన ఈ చిన్న సినిమాకు ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ ఎంట్రీ ఇచ్చింది. 'కేజీఎఫ్', 'కాంతార', 'సలార్' లాంటి పెద్ద సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న సంస్థ, 'హనుమాన్ అంష్' ఓవర్సీస్ రిలీజ్ బాధ్యత తీసుకుంది. హోంబలే ఓవర్సీస్ ద్వారా సెప్టెంబర్ 11 నుంచి అంతర్జాతీయ మార్కెట్లలో సినిమాను విడుదల చేయబోతున్నారు. ఫార్స్ ఫిల్మ్ కూడా ఈ రిలీజ్‌లో భాగమవుతోంది. రూ.2 కోట్ల చిన్న సినిమా, రూ.10 లక్షల ఓపెనింగ్ నుంచి మొదలై నెల రోజుల్లోనే ఇలాంటి పెద్ద డిస్ట్రిబ్యూషన్ సంస్థ దగ్గరకు వెళ్లడం హైలైట్. పైగా నీమ్ కరోలి బాబాకు విదేశాల్లో కూడా ఫాలోయింగ్ ఉంది. అందుకే ఇండియాలో వచ్చిన రెస్పాన్స్ ను చూసిన తర్వాత ఓవర్సీస్‌లో కూడా సినిమాకు మంచి అవకాశం ఉందని హోంబలే భావించినట్టు కనిపిస్తోంది. సెప్టెంబర్ 11 నుంచి 'హనుమాన్ అంష్'కు కొత్త లెక్క మొదలవుతుంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613